క్లుప్తంగా

కోవూరులో సేదతీరిన పుదుచ్చేరి సీఎం



సీఎం రంగస్వామికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

కోవూరు : పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి శ్రీశైలం మల్లన్న దర్శనం చేసుకుని తిరుగు పయనమవుతూ సోమవారం అర్ధరాత్రి కోవూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌లో కొద్దిసేపు సేదతీరారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కన్వెన్షన్ సెంటర్‌లో అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లపై సీఎం రంగస్వామి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మంత్రులు, స్థానిక నాయకులు తాటిపర్తి విజయకుమార్‌రెడ్డి, అత్తిపల్లి పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయంలో ధనుర్మాస పూజలు



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు గోవిందనామస్మరణలు చేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



నార్త్రరాజుపాళెం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కొడవలూరు : మండలంలోని నార్త్రరాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 గణిత పరీక్షను ఎంఈఓ జి.వసంతకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని వసతులతో పరీక్ష నిర్వహిస్తుండడాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట హైస్కూల్ హెచ్‌ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉద్యోగినికి వేధింపులు

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగినిని వేధింపులకు గురిచేస్తున్న ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పొదలకూరు రోడ్డులోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో ఓ మహిళ అటెండర్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా ఆమెను కార్యాలయ సూపరింటెండెంట్ రాజన్ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆయన్ను మందలించారు. అయినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. విసిగిపోయిన బాధితురాలు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నెల్లూరు(క్రైమ్): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు సీజ్ చేశారు. వివరాలు.. ఎస్ఈబీ నెల్లూరు – 1 ఎస్సై శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి శెట్టిగుంట రోడ్డులోని సర్వేపల్లి కాలువ బ్రిడ్జి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కోవూరు మండలం జమ్మిపాళేనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ట్రాక్టర్, నిందితుడ్ని నవాబుపేట పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలి

- ఉపాధ్యాయులకు సూచన
- ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

బుచ్చిరెడ్డిపాళెం : విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను బోధించాలని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు ఉపాధ్యాయులకు సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ ఉన్నత పాఠశాల, బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమ్మేటివ్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. ప్రణాళికాబద్ధంగా బోధించడం వల్ల విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందన్నారు. ముఖ్యంగా ఈ పరీక్షల వల్ల వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే మనబడి నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద ఎలా ఉందని, జగనన్న విద్యాకానుక కింద ఇచ్చిన ట్యాబ్‌ల పనితీరుపై ఆరా తీశారు. ఆయన వెంట నెల్లూరు రూరల్ డిప్యూటీ డీఈఓ భిక్షాలు, ఆర్ఐపీఈ షేక్.మెహబూబ్‌బాషా, ఎంఈఓ దిలీప్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్‌కుమార్, హెచ్‌ఎం సుజాత తదితరులు ఉన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు : జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. డిసెంబర్ 12వ తేదీన సేవ్ ది చిల్డ్రన్–ఆర్ఎస్ఈటీఐ సంయుక్తంగా జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసింది. ఈపూరు, దొరువులపాళెం పంచాయతీలకు చెందిన 35 మంది మహిళలు ఈ శిక్షణలో పాల్గొని, బ్యాగుల తయారీలో అనుభవం గడించారు. వీరి అంకిత భావాన్ని మెచ్చుకున్న మంత్రి కాకాణి నక్కలమిట్టలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందచేసి, అభినందించారు. వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రామాయణం మహేష్‌స్వామికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మహేష్‌స్వామి

ఇందుకూరుపేట : అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మండలంలోని కొత్తూరు శ్రీలలితా మహేశ్వరి ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ఆయుర్వేద విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. చెన్నై నగరంలోని మొగలివాకంలో ఉన్న శ్రీరామ్‌జీ కన్వెన్షన్ సెంటర్‌లో వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు ఆదివారం గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవం జరిగింది. ఆయుర్వేద వైద్యం చేస్తుండడంతో తనకు డాక్టరేట్ లభించిందన్నారు. మహేష్‌స్వామికి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

వెంకటాచలం : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఐదు రోజుల నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ముప్పవరపు వెంకయ్యనాయుడు సోమవారం స్వర్ణభారత్ ట్రస్టుకు వచ్చారు. నెల్లూరు, వెంకటాచలం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, వివిధ శాఖల అధికారులు మంగళవారం వెంకయ్యనాయుడును కలిశారు.

డీఎల్‌డీఏ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్

కోవూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి సంఘం వారు పాడి రైతుల్లో మరింత అవగాహన పెంచి డీఎల్‌డీఏ అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. కోవూరులోని డీఎల్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మేలు జాతి పశు సంపదను పెంచేలా డీఏ ఎల్‌డీఏ దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. రూ.20 వేలు విలువ చేసే మేలు జాతి దూడలను రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో పశుగణాభివృద్ధి కేంద్రం ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారన్నారు. డీఎల్‌డీఏ కార్యవర్గంతో పాటు పాడిరైతుల సహకారంతో గత సంవత్సరం రాష్ట్రస్థాయి అవార్డు డీఎల్‌డీఏకు వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డెయిరీ ఎండీ కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ సోమయ్య, పశు వైద్యులు సురేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థి బడిబాట



ఉపాధ్యాయుడు నాగభూషణంతో భరత్‌ను బడికి పంపుతున్న తల్లి

కొడవలూరు : ఉపాధ్యాయుడి చొరవతో డ్రాపౌట్‌గా ఉన్న విద్యార్థి బడిబాట పట్టారు. గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కె.భరత్ అనే విద్యార్థి గత కొద్దిరోజులుగా పాఠశాలకు రావడం లేదు. దీనిని గమనించిన పాఠశాల హిందీ పండిట్ జి.నాగభూషణం విద్యార్థి గురించి ఆరా తీశారు. తాటాకులదిన్నె గ్రామానికి చెందిన విద్యార్థి భరత్ ఇంటి వద్దే ఉంటున్నట్లు తెలుసుకున్నారు. గత నాలుగు రోజులుగా ప్రతిరోజూ ఆ విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో విద్యార్థి గురించి మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుకుంటే చేకూరే ప్రయోజనం, ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో తల్లిదండ్రులు భరత్‌ను పాఠశాలకు పంపేందుకు అంగీకరించి మంగళవారం నుంచి పాఠశాలకు పంపారు. డ్రాపౌట్ విద్యార్థి పట్ల ఉపాధ్యాయుడు చూపిన చొరవను విద్యార్థి తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు కూడా అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలతో జయప్రకాష్ తదితరులు

ఇందుకూరుపేట : క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. మండలంలోని డైట్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రగతి యువకేంద్రం సారథ్యంలో ఇందుకూరుపేట బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డితో కలిసి పలు క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతను సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ప్రగతి యువకేంద్రం సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి, పీడీ దశరథరామిరెడ్డి, వివేకానంద యువజన సంఘ అధ్యక్షుడు వంశీధర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరులో 'గడప గడపకు..'

- పాల్గొననున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు : మండల కేంద్రమైన ముత్తుకూరులో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు.

మిషన్ అంత్యోదయపై శిక్షణ

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు మిషన్ అంత్యోదయపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సంబంధిత కార్యదర్శులు పర్యటించి ఎలాంటి మౌలిక వసతులు ఉన్నాయి.. ఇంకా ఎలాంటి వసతులు కల్పించాల్సి ఉంది.. తదితర అంశాలపై సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ వి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, డి.సురేష్‌కుమార్ ఎస్కే.షబ్బీర్, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి సచివాలయ కన్వీనర్ల నియామకం

కోవూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గంలోని ప్రతి సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లను, ఇద్దరు రథ సారథులను ఇటీవల ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నియమించారు. వీరిని మానిటర్ చేసేందుకు మండల స్థాయిలో ఒక్కో మండలానికి ఒక కన్వీనర్‌ను మంగళవారం నియమించారు. కోవూరుకు కవరగిరి ప్రసాద్, బుచ్చి నగర పంచాయతీ పరిధిలో మోర్ల మురళీ, బుచ్చి రూరల్ పరిధిలో బిల్లా వినోద్‌కుమార్, కొడవలూరుకు కొండా శ్రీనివాసులురెడ్డి, విడవలూరుకు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, ఇందుకూరుపేటకు బందిల వెంకటరమణ్యలను నియమించారు. వీరంతా సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రసన్న సూచించారు.

ఏపీజీబీ సేవలపై అవగాహన

మనుబోలు : మండలంలోని అక్కంపేట గ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్(ఏపీజీబీ) సేవలపై మంగళవారం కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నగదు దాచుకునే ఖాతాదారులకు మిగిలిన బ్యాంకుల కంటే అధిక వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ప్రగతి సిరి స్కీం ద్వారా 400 రోజులకు 7.25 శాతం , 666 రోజులకు 7.60 శాతం వడ్డీ చెల్లిస్తామని తెలిపారు. అనంతరం బ్యాంక్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలు, పథకాలపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం కోఆర్డినేటర్ గురుస్వామి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : తమ విధులకు ఆటంకం కలిగించారని విడవలూరు సంఘమిత్ర కోశాధికారి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మండలంలోని ఊటుకూరులో వెలుగు ఆధ్వర్యంలో వీఓఏగా భవాని విధులు నిర్వహిస్తోంది. ఆమె పరిధిలో పొదుపు సంఘాలు తీసుకున్న స్త్రీనిధికి చెందిన నిధుల చెల్లింపు విషయంలో తేడా వచ్చింది. దీంతో ఏపీఎం హరి మంగళవారం భవానికి ఫోన్ చేసి నీ సంఘబంధంలో నిధులు చెల్లింపులో తేడా వస్తోందని, త్వరగా చెల్లించాలని కోరారు. దీంతో భవాని తన భర్త వెంగళరావును తీసుకుని విడవలూరు వెలుగు కార్యాలయానికి చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, సంఘమిత్ర సిబ్బందిని దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు సంఘమిత్ర కోశాధికారి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవాని, ఆమె భర్త వెంగళరావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రీసర్వేతో భూ వివాదాల పరిష్కారం



రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

- జేసీ కూర్మనాథ్

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని పార్లపల్లి, చౌకచెర్లలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వందేళ్ల క్రితం చేసిన సర్వే కారణంగా ప్రస్తుతం పలు గ్రామాల్లో భూ వివాదాలు నెలకొన్నాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీని ద్వారా భూ వివాదాలకు పరిష్కారం లభిస్తోందని తెలిపారు. భూ సమస్యలను ఎదుర్కొంటున్న హక్కుదారులు రీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయం తనిఖీ

విడవలూరు సచివాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ పథకాల బోర్డులను పరిశీలించారు. అలాగే వివిధ పథకాలను పొందిన లబ్ధిదారుల వివరాలతో కూడన పట్టికను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

పాఠశాలలో ముందస్తు సంక్రాంతి



సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

పొదలకూరు : పట్టణంలోని విజేత స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో చిన్నారులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. హరిదాసు, బొమ్మలకొలువు, రైతులు, ఎడ్లబండ్లు, గొబ్బెమ్మ, భోగిపళ్లు తదితరాలతో కళ్లకు కట్టినట్టు పండగ వాతావరణం తీసుకొచ్చారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ జి.కామాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా కొత్తవంగల్లులో ప్రచారం



పట్టభద్రుడికి క్యాలెండర్, కరపత్రాలు ఇస్తున్న నాయకులు

కొడవలూరు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని కొత్తవంగల్లులో వైఎస్సార్‌సీపీ నేత సి.మనోహర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 85 మంది పట్టభద్రులు ఉండగా, ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి క్యాలెండర్, కరపత్రాలను ఇచ్చి పేర్నాటిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వేముల వెంకటేశ్వర్లు, నవీన్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల ద్వారా ఎరువుల పిచికారీ



డ్రోన్ సేవలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ముత్తుకూరు : డ్రోన్‌ల ద్వారా వరి చేలల్లో పురుగు మందులతో పాటు ఎరువులను పిచికారీ చేసుకోవచ్చని ఇందుకూరుపేట వ్యవసాయ సంయుక్త సంచాలకుడు రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని మామిడిపూడి వరి పొలాల్లో మంగళవారం ప్రయోగాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ, పురుగు మందులు, రసాయనిక మందులు, నానో ఎరువులను ఈ డ్రోన్‌ల సాయంతో చేలల్లో పిచికారీ చేయవచ్చన్నారు. రైతులు అవగాహన పెంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.మస్తానమ్మ, వైఎస్సార్‌సీపీ నేత పద్మనాభరెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్, వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్ నగదును అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రామచంద్రాపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని ఆరుగురు విద్యార్థులకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మహేంద్ర మాట్లాడుతూ కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి పథకం కింద ప్రతి సంవత్సరం ఒక పాఠశాలను ఎంపిక చేసుకుని మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రామచంద్రాపురంలోని గురుకుల బాలికల పాఠశాలను ఎంపిక చేసి 5, 6, 7 తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థినులను రూ.2,500ల చొప్పున అందజేశామన్నారు. అలాగే 8, 9, 10 తరగతులకు సంబంధించి మరో ముగ్గురు విద్యార్థినులకు రూ.5 వేల చొప్పున అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయలక్ష్మి, బ్యాంక్ సిబ్బంది స్మృతి పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



అదుపులోకి తీసుకున్న నిందితులతో సెబ్ పోలీసులు

కోవూరు : మండల పరిధిలోని చెర్లో గాంధీసంఘం ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై సెబ్ సీఐ నరహరి ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, రెండు మోటార్‌సైకిళ్లు, రూ.1,500ల నగదును సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోవూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్సైలు శ్రీధర్, శ్రీనివాస్, సిబ్బంది మస్తానయ్య తదితరులు ఉన్నారు.

పెద్దల పండగకు పటిష్ట ఏర్పాట్లు



సమాధుల తోటను పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: సంక్రాంతిని పురస్కరించుకొని బోడిగాడితోటలో నిర్వహించనున్న పెద్దల పండగకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. బోడిగాడితోటలో సమాధుల తోటను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. సమాధులకు సున్నాలు వేయించాలని.. పశువులు సంచరించకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ ఈఈలు సంజయ్, చంద్రయ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.